అంతటా దొరకటంలేదు అందుచేత దానికోసం వెతుక్కొంటున్నాము. దాని అర్థం ఏమిటి అంటే హృదయంలో ఆనందం ఉంది అది మనకు దొరకటంలేదు. అందుచేత దానికోసం బయట వెతుక్కొంటున్నాము, పెళ్ళిళ్ళు పేరంటాలు అని తిరుగుతున్నాము. అసలు ఉన్నది మీకు దొరకటంలేదు. ఏమి చేస్తారు మరి? ఎక్కడోచోట వెతుక్కోవాలి కదా! అసలు ఉన్నది దొరికితే ఇంక ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు, ఎక్కడా తిరగనక్కరలేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-08-2016, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున జన్మాష్టమి. దీనినే గోకులాష్టమి, శ్రీకృష్ణాష్టమి అని అంటారు. కృష్ణుడు తిథి అష్టమి, రాముడు తిథి నవమి. రాముడిని పూర్ణావతారం అంటారు, కృష్ణుడిని పరిపూర్ణావతారం అంటారు. ఈరోజు భగవంతుడు శరీరం ధరించిన రోజు. కృష్ణుడు జన్మించిన స్థలం మధుర. అక్కడ గోడమీద ఏమని వ్రాసారు అంటే కృష్ణుడు పుట్టిన వాడివలె కనిపించాడు అని వ్రాసారు. అంటే వాసుదేవస్వామి ఇక్కడ పసిపిల్లవాడుగా దర్శనమిచ్చాడు. ఆయన జన్మస్థానం మధుర, తరువాత రేపల్లె తీసుకొనివచ్చారు, తరువాత బృందావనం. ఆ మూడు చోట్ల ఆయన చిన్నప్పటి లీలలు కనిపిస్తాయి. మధుర ప్రక్కన యమునా నది ఉంది. అక్కడ ఒక మడుగు ఉంది. ఆ మడుగులో కాళింగి అనే పెద్ద సర్పం ఉండేది. అది ఆ మడుగులోని నీటిని విషపూరితం చేసేది. ఆ కలుషితమైన నీటిని తాగి చాలా పక్షులు, మనుషులు చనిపోయేవారు. నేను చాలా బలమైన వాడిని అని ఆ సర్పానికి గర్వం ఉండేది. కృష్ణుడు బాలుడిగా ఉన్నప్పుడే ఆ మడుగులోనికి దిగి ఆ సర్పం యొక్క పడగల మీద నిలబడి దాని యొక్క గర్వాన్ని అణిచివేసాడు. మనిషి బాగుపడాలంటే ముందు గర్వం ఉండకూడదు. మీ ప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి వస్తూ ఉంటుంది. మీ పరిస్థితులు అన్నీ బాగున్నా కూడా గర్వాన్ని దగ్గరకు రానీయకూడదు. అప్పుడు ఆ సర్పం యొక్క భార్య వచ్చి కృష్ణుడితో ఏమంది అంటే వీడు ఇక్కడ నీటిని విషపూరితం చేస్తున్నాడు, వీడి గర్వాన్ని అణిచివేసావు, వీడిని చంపవద్దు, మేము సముద్రంలోనికి వెళ్ళిపోతాము అని చెప్పింది. అప్పుడు కృష్ణుడు వాడిని వదిలేస్తే అక్కడనుండి సముద్రంలోనికి పోయాడు. ఆవిధంగా నదిలోని నీటిని కలుషితం కాకుండా కాపాడాడు. పారిశుధ్యానికి అంత ప్రాధాన్యత ఇచ్చేవాడు. పారిశుధ్యం కూడా భగవంతుడితో సమానం. అందుచేత మనం పరిశుభ్రంగా ఉండాలి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.

భగవద్గీతను పరమాత్మ యుద్ధభూమిలో చెప్పాడు. మన ఋషులులాగ చెట్లకింద కూర్చుని చెప్పలేదు. భారతయుద్ధం మధ్యలో చెప్పాడు. ఇంకో గంటలో ఈ తలకాయలు ఉంటాయో లేదో తెలియదు, అటువంటి పరిస్థితులలో చెప్పాడు. అలా యుద్ధంలో చెప్పటం సాధ్యమా అని కొంతమంది అంటారు. మనకు సాధ్యంకాదు, మనకు టెన్షన్ వచ్చేస్తుంది. ఆయన భగవంతుడు కాబట్టి అలా చెప్పాడు. అసలు కృష్ణ శబ్దానికి అర్థం ఏమిటి అంటే

ఆకర్షించేవాడు అని. కృష్ణా కృష్ణా అంటే ఆ జీవుడిని ఆకర్షించేస్తాడు. రాగం ఎక్కువ ఉన్నా, భయం ఎక్కువ ఉన్నా మనుషులు చనిపోతారు. మాటమాటకు కోపం తెచ్చుకొన్నా మనం చాలా నష్టపోతాము. కోపం ఎక్కువ ఉన్నా, భయం ఎక్కువ ఉన్నా వికాసం పోతుంది. స్టూడెంట్స్ ఎలా అభివృద్ధిలోనికి రావాలి, ఎలా వికాసం పొందాలి అనేది యూనివర్శిటీలలో చెపుతున్నారు. వ్యక్తి ఎలా వికాసం పొందాలి అనేది భగవద్గీతలో వివరంగా చెప్పాడు. వేదాలసారం భగవద్గీత. భగవద్గీత చెప్పినవాడు భగవంతుడు, విన్నవాడు అర్జునుడు, వ్రాసిన వాడు వ్యాసుడు అని మనం మూడు పేర్లు చెప్పకొంటున్నాము. కాని పరమాత్మ ఏమన్నాడు అంటే అర్జునుడిని నేనే, వ్యాసుడిని నేనే అని చెప్పాడు అంటే ఉన్నది ఒక్కటే. మీకు పెర్సనాలిటీ డెవలప్‌మెంట్‌కు కావలసినవన్నీ భగవద్గీతలో చెప్పాడు. విచిత్రం ఏమిటి అంటే కృష్ణుడు, కంసుడు యుద్ధం చేసుకోవటం వల్ల కంసుడు చనిపోలేదు, భయం వల్ల చనిపోయాడు. కృష్ణుడు కంసుడితో యుద్ధం చేయలేదు. కృష్ణుడు విపరీతమైన బలవంతుడు. కంసుడు సింహాసనం మీద కూర్చున్నాడు. కృష్ణుడు వాడి సింహాసనం మీదకు ఉరికి కంసుడిని కిందకు గెంటేసాడు. కంసుడు కిందకుపడిపోయి ప్రాణం వదిలేసాడు. కృష్ణుడు అనేవాడు ఒకడు వస్తాడు, వాడివల్ల నువ్వు చనిపోతావు అని చెప్పారు కదా! అది వాడి లోపల ఉంది. కృష్ణుడు అంటే భయం వల్ల చనిపోయాడు అంతే. అంటే భయం ఎక్కువ ఉన్నా మనుషులు చనిపోతారు. కొంతమందికి ప్రతీ చిన్న విషయానికి కోపం వస్తుంది. ఇష్టాలు, అయిష్టాలు ఎక్కువ ఉండకూడదు. ఇవి కూడా చావుకి కారణం అవుతాయి. ఎవరిమీద అయినా మీకు ఎక్కువ ఎటాచ్‌మెంట్ ఉంది అనుకోండి, వారు చనిపోతే మీరు కూడా చనిపోతారు. కోపం వచ్చినప్పుడు మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా అవసరంలేని మాటలు వచ్చేస్తాయి. కోపం వచ్చినప్పుడు పదినిమిషాలు మౌనంగా ఉండటం మంచిది.

కీర్తి కాంక్ష కామక్రోధముల కంటే ప్రమాదమైనది అని పారడైజ్ లాస్ట్‌లో మిల్టన్ చెప్పాడు. స్వర్గం నీ హృదయంలోనే ఉంది. నీ ప్రవర్తన, నీ తలంపులు, నీ ఆలోచనలు సరిగా ఉంటే కనుక అంటే నీకు రైట్ బిహేవియర్, రైట్ స్పీచ్, రైట్ కాండక్టు కనుక ఉంటే నీ హృదయంలో ఉన్న స్వర్గం నీకు అందుబాటులోనికి వస్తుంది. కాని నువ్వు దానిని పట్టుకోలేకపోతున్నావు. నీ శరీరం కంటే, నీ మనస్సు కంటే, నీ ఇంద్రియములకంటే అతి సన్నిహితంగా నీ హృదయంలో స్వర్గం ఉన్నప్పటికీ అది నీకు అందకపోవటానికి నీ బిహేవియర్ కారణం. అంటే నీకు రైట్ బిహేవియర్ లేదు. నీ ప్రవర్తన వల్ల నీ హృదయంలో ఉన్న స్వర్గాన్ని నువ్వే పోగొట్టుకొంటున్నావు అని చెప్పటం. అదే పారడైజ్ లాస్ట్‌లో వ్రాసాడు. ఒకసారి బుద్దుడిని అడిగారు "మీరు చెప్పటం బాగానే చెపుతున్నారు, కానీ వాటిని ఆచరించటం కష్టంగా ఉంది, కొంత అయినా మేము ఆచరించలేకపోతున్నాము, మీరు చెప్పే మాటలో సత్యం ఉందని మేము గ్రహించినా దాని మీద మాకు తగినంత శ్రద్ధ కలగటంలేదు" అని బుద్దుడిని అడిగారు. అప్పడు బుద్ధుడు ఒక మాట చెప్పాడు "మీరు చెప్పేమాట బాగానే ఉంది. మీరు నా మాటలను ఆచరించలేక

పోతున్నారు కదా! నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. రిమెంబర్ మి. నన్ను జ్ఞాపకం పెట్టుకోండి సరిపోతుంది. ఇంక మీకు ఏమీ అక్కరలేదు. మీకు ప్రాక్టీసు చేసే శక్తి ఆ ఎనర్జీ లోపలనుండి వచ్చేస్తుంది. మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటే చాలు" అన్నాడు.

కొంతమంది తెలియనివాళ్ళు కృష్ణుడిని పాండవ పక్షపాతి, పాండవులు అంటే ఆయనకు ఇష్టం అని అనుకొంటారు. ఆయనకు పక్షపాతం ఏమీలేదు. పాండవులు ధర్మంగా ఉంటారు, న్యాయంగా ఉంటారు, వారికి కొంత సపోర్టు ఇవ్వాలి అని, అంతేకాని పక్షపాతం ఏమీలేదు. పక్షపాతం ఉంటే రాయబారానికి ఎందుకు వెళ్తాడు. రాయబారం చెయ్యడు కదా! మీరందరూ చనిపోతారు, యుద్ధం మంచిదికాదు, రాజీ చేసుకోవటం మంచిది అని చెప్పటానికి వెళ్ళాడు కదా! మంచి చెప్పటానికి వస్తే కౌరవులు ఆయనను బంధించారు. రాయబారిని బంధించకూడదు, చంపకూడదు అది రాజ్యాంగ విరుద్ధం, సాంప్రదాయ విరుద్ధం. కృష్ణుడు చిన్నప్పటినుండి రాక్షస సంహారం చేస్తూనే ఉన్నాడు. రాక్షసులు బయటలేరు, మనలోపలే ఉన్నారు. దుర్యోధనుడు వాళ్ళు బయటకు మనుషుల కింద కనిపించినా లోపల రాక్షస స్వభావం, ఇటువంటి వారినందరిని తీసేయాలి అనుకొన్నాడు. ఇంటింటికి వెళ్ళి ఎంతమందిని చంపుతాడు. అందుకే యుద్ధం అని ప్లాన్ వేసాడు. "రాయబారం సక్సెస్ అవ్వదు అని నీకు తెలుసుకదా, తెలుసుండి నువ్వు రాయబారానికి ఎందుకు వెళ్ళావు?" అని కృష్ణుడిని అడిగారు. "రాయబారం సక్సెస్ అవ్వదు అని తెలుసు కాని డ్యూటీ చెయ్యాలి కదా! కృష్ణుడులాంటివాడు ఉండి రాయబారాలు చేయకుండా యుద్ధం మొదలు పెట్టేసాడు అని మాట రాకుండా ఈ రాయబారాలు చేస్తున్నాను. ఇవి వాళ్ళు వినరు అని నాకు తెలుసు అయినా డ్యూటీ చెయ్యాలని చేస్తున్నాను" అని చెప్పాడు.

"మీ రమణ భక్తులు ఎవరితోటి కలవరు, ఏ పుస్తకాలు చదవరు, రమణమహర్షి పుస్తకాలు వేసుకొని తిరుగుతూ ఉంటారు, సత్సంగాలు ఎక్కడ జరిగినా వెళ్ళరు ఏమిటి?" అని కొంతమంది నన్ను అడిగారు. నేను ఏమి చెప్పాను అంటే "వాళ్ళు అలా అలవాటు పడిపోయారు, ఏదో మంచిమార్గంలో ఉన్నారు, ఏదో రకంగా బాగుపడాలి కదా! పోనీ వాళ్ళకు అలా ఇష్టంగా ఉంది, అలా వెళ్ళనివ్వండి, అలా బాగుపడనివ్వండి. ఇక్కడో గెడ్డపార, అక్కడో గెడ్డపార ఎందుకు వేస్తారు? అలా ఇక్కడో గెడ్డపార, అక్కడో గెడ్డపార వేస్తే నీళ్ళు పడవు కదా! ఒకేచోట వేస్తే నీళ్ళు పడతాయి. వాళ్ళ పద్ధతిలో వాళ్ళు చేసుకొంటున్నారు, వాళ్ళకు రమణ రూపం, రమణ నామం, రమణ టీచింగు సరిపోతుంది. మీరంటే ఇష్టం లేక కాదు. వాళ్ళ పద్ధతిలో వారు ఉంటారు, మీ పద్ధతిలో మీరు ఉండండి. వారు మాతోటి కలవటంలేదు అని మీరు అనుకోవద్దు. కలవకపోవటమే మంచిది. ఒకవేళ కలిసి నేను ఎవడను అని మొదలుపెడితే మీకు కన్ఫ్యూజన్ వస్తుంది" అని చెప్పాను. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు అని అర్థం. సూర్యుడు బయట ఉన్న చీకటిని పోగొడతాడు. మనలో అజ్ఞాన రూపంలో ఉన్న చీకటిని, అవిద్య రూపంలో ఉన్న చీకటిని పోగొట్టేవాడే గురువు.

భారత యుద్ధం మొదలు అయ్యాక అర్జునుడు తాతగారిని, గురువుగారిని చూసి "వీళ్ళను ఎలాగ చంపటం? ఇంటికి వెళ్ళిపోదాము" అంటాడు. అప్పుడు కృష్ణుడు ఒకమాట చెప్పాడు. ఇది నాకు చాలా ఇష్టం. ఈ వాక్యం భగవంతుడు చెప్పాడు. "ఇక్కడ నీ తాత గారు ఉన్నాడు, నువ్వు చంపకపోతే ఆయన చచ్చిపోడా? నీ గురువు ఉన్నాడు, వాడు నువ్వు చంపకపోతే చనిపోడా? మిగతా వాళ్ళందరూ మీ కుటుంబమే. వాళ్ళను చూసి నీకు మోహం వస్తోంది. వీళ్ళందరను చంపటం ఎలాగ అని నువ్వు అనుకొంటున్నావు. అర్జునా! నువ్వు ఎవరినైతే చంపుదామని అనుకొంటున్నావో వాళ్ళందరినీ నేను చంపి పోగులు పెట్టి ఉంచాను. నేను చంపిన వాళ్ళనే నువ్వు చంపటం. ఊరికే నువ్వు చేతులు ఆడించు. పని నాది, గౌరవం నీది. అర్జునుడు బాగా యుద్ధం చేసాడు, అందరినీ జయించాడు అనుకొంటారు. గౌరవం నువ్వు పొందుతావు. భీష్ముడిని చంపగలనా, ద్రోణుడిని చంపగలనా అని నీకు భయం వేస్తోంది కాని వాళ్ళని నేను చంపేసి ఉంచాను. నేను చంపిన వాళ్ళనే నువ్వు చంపటం" అన్నాడు. దీనినిబట్టి పరమాత్మ గురించి మీకు తెలుస్తోంది కదా! అక్కడ స్వామికి మనం శరణాగతి చెయ్యాలి.

భారతయుద్ధం అయిపోయిన తరువాత భీష్ముడు అంపశయ్యమీద ఉన్నాడు. కృష్ణుడు ధర్మరాజుతో ఏమన్నాడు అంటే "మీ తాతగారు బాగా శాస్త్రపండితుడు, ఆయనకు సర్వధర్మాలు తెలుసు, వేదపండితుడు, మహాభక్తుడు. ధర్మాల గురించి ఆయనను అడిగి తెలుసు కుందాము, ఆయన దగ్గరకు వెళదాము" అని చెపుతాడు. అప్పుడు ధర్మరాజు, అందరూ భీష్ముడి దగ్గరకు వెళతారు. అప్పుడు ధర్మరాజు భీష్ముడిని అడుగుతాడు. "తాతయ్యా! మాకు బాగుపడే విధానం చెప్పు. ధర్మంగా ఎలా జీవించాలో చెప్పు" అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ఏమన్నాడు అంటే "ఇదంతా మాయకాకపోతే ఏమిటి వాసుదేవా! నువ్వు ఉన్నావు కదా నన్ను చెప్పమంటాడు ఏమిటి? పైగా వీళ్ళందరిని నువ్వు తీసుకొని వచ్చావు. నువ్వు భగవంతుడవు. నిన్ను దగ్గరపెట్టుకొని నేను వీళ్ళకు ఏమి చెపుతాను?" అంటాడు భీష్ముడు. "మానవధర్మం ప్రకారం తీసుకొనివచ్చాను. నీకు మనవడు కదా! నా మనవడు అనే అభిమానం నీకు ఉంది. తాతయ్యగారు అనే అభిమానం వాడికి ఉంది. మీరు శాస్త్ర పండితులు అందుచేత చెప్పండి" అన్నాడు కృష్ణుడు. అప్పుడు కృష్ణుడిని ప్రక్కన కూర్చోబెట్టుకొని భీష్ముడు ధర్మరాజుకు విష్ణుసహస్ర నామాలు చెప్పాడు.

**యోగస్థ కురు కర్మాణి సంగం త్య క్త్వా ధనంజయ**
**సిద్ధ్యసిద్ధ్యో సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే**

సమాన బుద్ధి కలిగిన వాడినే యోగి అంటారు. హెచ్చుతగ్గులు లేనివాడు, రాగద్వేషాలు లేనివాడు, నిదానంగా ఉన్నవాడు, ఇష్టాలు అయిష్టాలు లేనివాడికి సమానబుద్ధి ఉంటుంది. వాళ్ళ ఆలోచన చాలా నిర్మలంగా ఉంటుంది, నిదానంగా ఉంటుంది. వాళ్ళు ఎటోకటు

ఒరిగిపోరు. నువ్వు యోగంలో ఉండి పని చెయ్యి. నువ్వు పనిచేస్తూ ఉండు ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి వలన మనకు కొన్ని మానసిక అనారోగ్యాలు వస్తాయి. నువ్వు ఆసక్తి లేకుండా పని చెయ్యి. నువ్వు చేసే పని వలన జయం కలుగవచ్చు, జయం కలుగకపోవచ్చు. కాని చేసే పని ఆసక్తి లేకుండా చెయ్యి. ఫలకాంక్ష లేకుండా చెయ్యి. మన అందరి దగ్గర దోషం ఎక్కడ ఉంది అంటే మనకు కోరిక ఉంటే ఫలం వస్తుంది, కోరిక లేకపోతే రాదు అనుకొంటాము. కోరికకు శక్తి లేదు. మన ప్రారబ్ధంలో ఫలం వచ్చేది ఉంటే వస్తుంది లేకపోతే రాదు. దేహం యొక్క ప్రారబ్ధం బలీయమైనది. కొంతమందికి చిన్న పని చేసినా పెద్ద ఫలితం వస్తుంది. కొంతమందికి పెద్దగా కష్టపడినా చిన్నఫలితం వస్తుంది. అంటే ఇచ్చేది చైతన్యం. అది జడంకాదు, కర్మ జడం. నేను ఇంత కష్టపడ్డాను కదా నాకు ఇంత ఫలితం రావాలి అని లెక్కలు వేసుకోవడం కుదరదు. కర్మఫలాన్ని ఇచ్చేవాడు భగవంతుడు. నేను ఇంత కష్టపడ్డాను అంటే ఆ పని కాదు కదా నీకు ఫలితాన్ని ఇచ్చేది, ఫలితాన్ని ఇచ్చేవాడు ఈశ్వరుడు. నువ్వు శరీరంతో బయట కష్టపడుతున్నావు కాని అసలు ఆ పని చేసేటప్పుడు నువ్వు లోపల ఎలా ఉన్నావు? ఒక మనిషి యొక్క విలువ వాడి దగ్గర ఉన్న డబ్బునిబట్టిగాని, వాడి చదువునుబట్టిగాని, వాడి సోషల్ స్టేటస్‌నుబట్టిగాని, వాడి పాండిత్యాన్నిబట్టిగాని బాహ్యంగా దేనిమీద ఆధారపడిలేదు. వాడు లోపల హృదయంలో ఎలా ఉన్నాడు అనే దాని మీద మనిషి యొక్క విలువ ఆధారపడి ఉంది అని అరవింద ఘోష్ చెప్పారు. నువ్వు పని చేస్తున్నావు, రైట్ కాని నీ హృదయంలో ఏముంది? నువ్వు గౌరవం కోసం చేస్తున్నావా? కీర్తి కోసం చేస్తున్నావా? లేకపోతే పని పనికోసమే చేస్తున్నావా? అది భగవంతుడు చూస్తాడు. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు కదా!

ఇంకో పది నిమిషాలలో మనకు ఏ తలంపు వస్తుందో మనకు తెలియదు, అది ఈశ్వరుడికి తెలుసు. ఏసు దేవుని కుమారుడు, ఏసు దేవుని కుమారుడు అని ఏసుక్రీస్తు భక్తుడు ఒకడు అంటాడు. అప్పుడు ఏసు ఏమన్నాడు అంటే నన్ను నువ్వు దేవుడి కుమారుడు అంటున్నావు. మూడవరోజున 30 రూపాయల లంచానికి నువ్వు నన్ను పట్టిఇస్తావు అని చెప్పాడు. నీకు డబ్బు మీద మమకారం ఉంది, అది నీకు తెలియదు. వాడి హృదయంలో ఏ బర్డెన్స్ ఉన్నాయో వాడికి తెలియదు, వాడు జీవుడు కదా. డబ్బును చూడగానే ఆకర్షణ వచ్చింది, 30 రూపాయల లంచానికి ఏసు ఎక్కడ ఉన్నాడో పట్టి ఇచ్చాడు. సరిగా మూడవ రోజున ఏమి జరుగుతుందో ఏసు కరెక్టుగా చెప్పేసాడు. వాడు దేవుని కుమారుడు. అయితే మీరందరూ మంచివారే కాని మీ లోపల ఏ బర్డెన్స్ ఉన్నాయో, పునర్జన్మ కారణాలు ఏమి ఉన్నాయో మీకు తెలియదు, అది ఈశ్వరుడికి తెలుస్తుంది. ఎప్పుడు ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. రేపు జరిగేది రేపు జరుగుతుంది కాని ఇవాళే జరిగిపోతే బాగుండును అంటే అది జరగదు. ప్రతీదీ ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతుంది, అసలు మనం లేము, ఉన్నది ఈశ్వరుడే. మీకు ఏదైనా గౌరవం వస్తుంది అనుకోండి, ఆ గౌరవం మీది కాదు,

ఈశ్వరుడిదే. మీరు ఏమనుకొంటారు అంటే మనం చేసిన పనుల వలన గౌరవం వచ్చింది అనుకొంటారు. మరి మీకంటే మంచిపనులు చేసిన వాళ్ళు ఉన్నారు కదా, వారికి ఆ గౌరవం వచ్చిందా? చేసేది అంతా ఆయనే, అంతా ఈశ్వరుడే.

ఫిలాసఫీలో ఏమని చెపుతారు అంటే అవకాశాలు రాకపోతే ఎవరూ ఏమీ చేయలేరు. అవకాశం వచ్చినప్పుడు ఎవరైతే పట్టుకొన్నారో వాళ్ళు పెద్దవాళ్ళు అవుతారు. అవకాశం వచ్చినప్పుడు మనం దానిని పట్టుకోవాలి. అవకాశం రాకపోతే తెలివైన వాడు కూడా ఏమీ చేయలేడు. అవకాశం వచ్చినప్పుడు తెలివైనవాడు దానిని పట్టుకొని అభివృద్ధిలోనికి వస్తాడు. యోగంలో ఉండి నువ్వు పని చెయ్యి. ఆసక్తి దోషం పెట్టుకోవద్దు. మా ప్లిలలను బాగా చదివించాము అని చాలామంది అంటారు. వాళ్ళకు చదువు వస్తే చదువుకొన్నారా, మీరు చదివించారా? వాళ్ళకు చదువు రాకపోతే మీరు చదివించగలరా? వాళ్ళకు చదువు వచ్చింది, వాళ్ళు చదువుకొన్నారు. ఏదో మనం మెటీరియల్‌గా బయటనుండి వారికి సపోర్టు ఇచ్చాము అని మీకు తెలియటంలేదు. మేము వాళ్ళను పైకి తీసుకొనివచ్చాము అనుకొంటారు. అది తప్పు అంటున్నాడు. ఇదంతా మాయ. మీరు వాళ్ళకు అవకాశం కల్పిస్తున్నారు అంతే. వాళ్ళంతట వాళ్ళు అభివృద్ధిలోనికి వస్తారు. చేతులు మీవి. అసలు వాళ్ళు ఆ స్థితికి రావాలని ఉంటే ఒకవేళ మీరు సహాయం చెయ్యరు అనుకోండి, ఇంకొకడిచేత సహాయం చేయిస్తాడు. వాడు పరమాత్మ. నీ బుద్ధిని సమానం చేసుకొని పనిచెయ్యి. కర్మను యోగంగా చెయ్యి, ఇప్పుడు మనం స్వార్థంతో పనిచేస్తున్నాము అందుకే మనకి జ్ఞానం కలగటంలేదు. నువ్వు పని చెయ్యి అందులో నువ్వు సక్సెస్ అవ్వవచ్చు, ఫెయిల్ అవ్వవచ్చు. సక్సెస్ అయితే సంతోషపడిపోయి నువ్వు గర్వం తెచ్చుకోవటం, ఫెయిల్ అయితే దుఃఖపడిపోయి కృంగిపోవటం, బెంగ పెట్టుకోవటం అలా ఉండకూడదు. బెంగ పెట్టుకోవటం కూడా మంచిదికాదు, బెంగ వల్ల మనస్సుకు జబ్బు వస్తుంది. నువ్వు సమానబుద్ధిని కలిగి ఉండు.

కొంతమంది ఎలా ఉంటారు అంటే మీ ఇంటికి వస్తే మాకు ఏమి ఇస్తారు, మా ఇంటికి వస్తే మీరు ఏమి తెస్తారు అంటారు. మనం అలా ఉండకూడదు. వాళ్ళకు ఉపకారం చేస్తే మనకు ఏమి కలిసి వస్తుంది? వీళ్ళకు ఉపకారం చేస్తే మనకు ఏమి కలిసి వస్తుంది? అని ఇలా చాలామంది ఆలోచిస్తారు. పైకి కనబడరు కాని మనుషులలో చాలామంది ఇలాగే ఉంటారు. ఇలా మీరు ఏదో పెద్ద మనుషుల కింద చలామణి అయిపోతున్నారు. మీ మీద కూలివాళ్ళు మెరుగు అంటున్నాడు పరమాత్మ. కూలి అంటే ఏమిటి ఉదయం మొదలు, సాయంత్రం వరకు పనిచేస్తే ఏదో 100 రూపాయలు కూలి ఇస్తారు. వాళ్ళకు ఉపకారం చేస్తే ఏమి వస్తుంది? వీళ్ళకు ఉపకారం చేస్తే ఏమి వస్తుంది? అని ఏదో ఒకటి ఆశించి పనిచేస్తూ ఉంటే మీరూ అంతే కదా! కర్మఫలాన్ని ఆశించేవారు, అక్కడికి వెళితే మనకు ఏమి వస్తుంది? ఇక్కడికి వెళితే ఏమి వస్తుంది అని ఇలా లెక్కలు వేసుకొనేవాళ్ళందరు కూలి వాళ్ళు అన్నాడు. మీరు మారని రూపాయలు కాని సమాజంలో

మీరు ఋషులకింద, యోగులకింద చెల్లిపోతున్నారు. మనం యోగులం అని మనం అనుకొంటున్నాము. మనలను కూలివాళ్ళు అని ఆయన అంటున్నాడు. మరి మన గురించి మనం అనుకొనేది నిజమా, ఆయన చెప్పేది నిజమా? మీరు నంబర్‌వన్ కూలివాళ్ళు. మీరు చేసే పనులు అత్యల్పమైన పనులు. వాడికి ఆ పనిచేస్తే ఏమి కలిసివస్తుంది? వీడితో మాట్లాడితే మనకు ఏమి కలిసివస్తుంది అని ఇలా చూసేవాళ్ళు అల్పాతి అల్పులు. కొంతమంది పిల్లలకు ఇచ్చింది కూడా జ్ఞాపకం పెట్టుకొంటారు. అది ఆశ్చర్యం. మా దగ్గర చాలా డబ్బు పట్టుకొని పోయారు, ఇప్పుడు మమ్మల్ని చూడటంలేదు అంటారు. వారిని తిడుతూ ఉంటారు, వీరందరూ అల్పులు. మీరు ఒకవేళ మంచి కర్మ చేసినా దానిని జ్ఞాపకం పెట్టుకోవద్దు. అది మంచి కర్మ అయినా ఇక్కడే ఈ భూమిమీదే వదిలేయండి, మీరు చనిపోయినప్పుడు మీకూడా పట్టుకెళ్ళవద్దు.

**బుద్ధి యుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్**

మీరు ఇంటి దగ్గర చేసుకొనే పూజే కాదు ఏ పని చేసినా అక్కడ నేర్పు ఉండాలి, ఓర్పు ఉండాలి. ఏదో వంట చేసేసాము అంటే కాదు రుచిగా ఉండాలి, శుచిగా ఉండాలి. మీరు చేసుకొనే పూజ, జపమే కాదు భౌతిక విషయాలు, లౌకికమైన పనులు కూడా నువ్వు ఓర్పుగా, నేర్పుగా చెయ్యాలి. మనం ఎవరికో ఏదో ఇస్తాము. నాయకులు అందరూ దానిని సేవ, సేవ అంటారు. సేవ అనే మాట మంచిదికాదు, అది మనస్సును ఉద్రేకపరుస్తుంది. సేవ అనకుండా పూజ అనమంటున్నాడు. మనం గుడికి వెళ్ళి అక్కడ హారతి పళ్ళెంలో పది పైసలు వేసాము అనుకోండి. దేవుడికి సేవ చేసాము, దానం చేసాము అనుకోము, దేవుడికి పూజ చేసాము అనుకొంటాము. అలాగే ఒక మనిషికి చేసే సహకారం కూడా పూజ అనుకో, సేవ అని అనుకోవద్దు. వారిలో అంతర్యామిగా ఉన్నవాడు ఈశ్వరుడే. ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి మీకు పంచి పెడతాడు. ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి ఐశ్వర్యం అక్కడకు వెళుతూ ఉంటుంది. నేను వారికేదో చేసాను, వీరికేదో చేసాను అని అనుకోవటం ఎలా ఉంటుంది అంటే ఒక తాతగారు ఆయన మనవడికి ఒక రూపాయి ఇచ్చారు. మనవడు ఆ రూపాయితో కొద్దిసేపు ఆడుకొని మళ్ళీ తాతగారికి ఇచ్చేసాడు. మా తాతయ్యకు రూపాయి ఇచ్చాను, మా తాతయ్యకు రూపాయి ఇచ్చాను అని అందరితోటి చెపుతున్నాడు. ఆ రూపాయి ఎవరిది? తాతయ్యదే. మనం చేసే దానధర్మాలు కూడా అలాగే ఉన్నాయి. ఆ సొమ్ము ఎవరిది అంటే ఈశ్వరుడిదే. అది మీకు తెలియటం లేదు. అది మీది అనుకొని మేము వారికి ఇచ్చేసాము, వీరికి ఇచ్చేసాము అని అనుకొంటున్నారు. ఇవన్నీ సొల్లు మాటలు అన్నారు భగవాన్.

శరీరం చనిపోయేటప్పుడు మంచి చెడ్డలను మీరు మోసుకొని వెళ్ళకండి, ఇక్కడే వదిలేయండి. మంచి ఏమో బంగారపు సంకెళ్ళు, చెడ్డ ఏమో ఇనుప సంకెళ్ళు. అవీ సంకెళ్ళే,

ఇవీ సంకెళ్ళే. అవి ఈ జీవుడిని బంధిస్తాయి. మేము ఆ పుణ్యం చేసాము, ఈ పుణ్యం చేసాము అని అనుకొంటూ శరీరం విడిచిపెట్టవద్దు. గీత, గంగ, గాయత్రీ, గోవిందా అనుకోండి. లేకపోతే అచ్యుతా, అనంతా, గోవిందా అనుకోండి. మీ ఇష్టం ఎలా అనుకొన్నా ఫరవాలేదు. గీత, గంగ, గాయత్రి, గోవిందా అలా అనుకోవటం మానేసి అక్కడ ఆ పనులు చేసాము, ఈక్కడ ఈ పనులు చేసాము, వాళ్ళకు చారు పోసాము, వీళ్ళకు పప్పు పెట్టాము అంటే ఎందుకు ఈ గొడవలు. వీటిని ఇక్కడే వదిలేయండి లేకపోతే వాటి వలన అహంభావన పెరిగిపోతుంది, రాబోయే జన్మలు నీచజన్మలు వస్తాయి. మీ శరీరం చనిపోయేటప్పుడు మీ ఇష్టదైవాన్ని స్మరించుకోండి. ఇక్కడ పరమాత్మ ఫైనల్‌గా ఒకమాట చెపుతున్నాడు. మోహం అనే మాలిన్యం, మోహం అనే కల్మషం నీ బ్రెయిన్‌లో ఉంది. అది అజ్ఞాన రూపంలో ఉంది. నువ్వు దానిని దాటి వెళ్ళాలి. ఈ శరీరంలో ఉండగానే, నీ శరీరం ఈ భూమి మీద తిరుగాడుతున్నప్పుడే ఈ మోహం అనే మాలిన్యం నుండి నువ్వు బయటపడాలి. ఈ శ్రవణం చేయుటం కూడా అజ్ఞానం పోవటానికే. నువ్వు మోహం అనే కల్మషం నుండి బయటపడితే ఇంక నీకు చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీ లేదు. నీకు అజ్ఞానం లేదు అనుకో ఇంక వినవలసిన పనిలేదు. నాకు చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు అనేవారు భగవాన్. మరి మీరు అరుణాచలాన్ని చూస్తున్నారు కదా అని అడిగితే అరుణాచలాన్ని చూడటం ఏమిటి? నన్ను నేనే చూసుకొంటున్నాను అన్నారు. ఒకసారి రంగన్‌తో భగవాన్ ఏమన్నారు అంటే ఎక్కడైతే ఆలోచనలు లేవో, ఎక్కడైతే తలంపులు లేవో, ఎక్కడైతే సంకల్పాలు లేవో, ఎక్కడైతే మాటలు లేవో అక్కడ నేను ఉన్నాను అన్నారు. ఎక్కడ తలంపులు లేవో, ఎక్కడ మాటలు లేవో అక్కడ నేను ఉన్నాను అంటున్నారు అయితే నాతోటి ఎందుకు మాట్లాడుతున్నావు అని రంగన్ అడిగితే నీతో పని ఉండి మాట్లాడటంలేదు, అవుటాఫ్ కంపేషన్. ఇది పొందాలి అనేటువంటిది ఏమీ జ్ఞానికి మిగలదు. వాడు కంప్లీట్ అయిపోతాడు. జ్ఞాని ఎలా ఉంటాడో గీతలో పరమాత్మ చెప్పాడు. నదులన్నీ కోపం వచ్చి సముద్రంలో కలవటం మానేస్తాయి అనుకోండి, సముద్రం నిర్వికారంగా ఉంటుంది. ఒక్క నది రావటం లేదు ఏమిటి అని సముద్రం అనుకోదు. నదులు అన్నీ వెళ్ళి ఒక్కసారి సముద్రంలో పడిపోతాయి అనుకోండి, సముద్రం ఏమీ పొంగిపోదు, అలాగే ఉంటుంది. జ్ఞాని అంటే సముద్రుడు. జ్ఞాని కూడా అలాగే ఉంటాడు, నిండుగా ఉంటాడు. మా పనికంటే మీ పనే బాగుంది, మీరు సోఫాలో కూర్చున్నారు అని ఒకరు భగవాన్‌తో అన్నారు. చూసేవాళ్ళకు అలా అనిపిస్తుంది. నేను కొండ మీద, రాళ్ళమీద చాలా సంవత్సరాలు కూర్చున్నాను. అయ్యో ఈ స్వామి రాళ్ళమీద కూర్చొంటున్నారు అని అప్పుడు అనుకొన్నారు. ఇప్పుడు స్వామి సోఫాలో కూర్చొంటున్నారు అని మీరు అనుకొంటున్నారు. అప్పుడు రాళ్ళమీద కూర్చున్నా, ఇప్పుడు సోఫాలో కూర్చున్నా శరీరమే. శరీరం యొక్క ప్రారబ్దం అలా ఉంది కాబట్టి అప్పుడు రాళ్ళమీద కూర్చొంది, ఇప్పుడుసోఫాలో కూర్చుంటోంది. నాకు సంబంధం ఏమిటి? అది శరీరం యొక్క గొడవ. అప్పుడు దేహం అలా ఉండవలసివచ్చింది, ఇప్పుడు ఇలా ఉండవలసి వచ్చింది. అంతేగాని ఇందులో మనకు సంబంధం ఏమీ లేదే. హృదయంలో ఉన్న సత్యానికి

దీనికి సంబంధం లేదే. వాడు జ్ఞాని. మనం పుష్కరస్నానాలు చేసాము. వాటిపేరు పవిత్ర స్నానాలు. భగవాన్ ఏమన్నారు అంటే నీ హృదయంలో ఒక నిజం ఉంది. నువ్వు స్నానం చేయకముందు అది అపవిత్రంగా ఉందా? స్నానం చేస్తే పవిత్రులమవుతాము అంటే అంతకు ముందు అపవిత్రంగా ఉందని అర్థమా. స్నానం చేసాక అది పవిత్రం అయిపోతుందా. ఆ లాజిక్కు చూడండి. ఈ స్నానాలు ఇవి అన్నీ కూడా దేహము, మనస్సు, బుద్ధికి సంబంధించిన విషయాలు కాని అసలు సత్యానికి దీనికి ఏమీ సంబంధం లేదు.

ఈ లోకం నిత్యంకాదు, సత్యంకాదు అని వేదాంతులు చెపుతున్నారు కదా అని రామకృష్ణుడితో అంటే ఆయన ఏమి చెప్పారు అంటే ఇది నిత్యం కాదు, సత్యంకాదు అనుకోండి. అసలు పుట్టకపోతే బాగుండును అనుకోవటం ఎందుకు? తీరా పుట్టేసారు కదా! ఈ లోకం నిత్యంకాదు, సత్యంకాదు అనుకొన్నా తీరా అనిత్యంలోనికి, అసత్యంలోనికి మీరు వచ్చేసారు కదా! మనం రోగంలో ఉన్నావని తెలిసినప్పుడు అందులో నుండి ఎలా విడుదల పొందాలి అని ఆలోచన ప్రారంభమవుతుంది. అసలు రోగం ఉండి లేదు అనుకొంటే ప్రమాదంలో పడతాము. మనం అజ్ఞానంలో ఉన్నామని తెలిసినప్పుడు దానిని ఎలా పోగొట్టుకోవాలి అని చూస్తాము. తీరా మనం అనిత్యంలోనికి, అసత్యంలోనికి వచ్చేసాము, దుఃఖ భూయిష్టమైన ప్రపంచంలోనికి వచ్చేసాము. ఇలా పదిసార్లు అనుకొంటే కుదురుతుందా? ఇంక ఆ గొడవలు వదిలేయండి. అనిత్యం ద్వారా నిత్యంలోనికి, అసత్యం ద్వారా సత్యంలోనికి, దుఃఖంలో నుండి సుఖంలోనికి వెళ్ళిపోవటానికి మీరు ప్రయత్నం చేయండి అంటున్నాడు రామకృష్ణుడు. ప్రపంచంలో దుఃఖం ఉంది, నువ్వుమటుకు దుఃఖరహితంగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. నీకు ఏ కారణాల వలన ఈ జన్మ వచ్చిందో ఆ కారణాలను తొలగించుకో. అప్పుడు ఇంక నీకు సంసారం రిపీట్ అవ్వదు.

నీకు ఏమైనా అప్పు ఉంటే నీకు అప్పు ఉంది, అప్పు ఉంది అని ఏడుస్తూ కోర్చోవద్దు. అప్పులో నుండి నిల్వలోనికి రావటానికి చూసుకో. నీ లోపల ఏదైనా చెడు ఉంటే దానిని మంచిగా మార్చుకో, అంటే నీ అశాంతినంతా శాంతిగా మార్చేసుకో. మీ మనస్సులో ఏదైనా విషం ఉన్నా దానిని అమృతంగా మార్చేసుకోండి. అలా అమృతంగా మార్చేసుకోవటానికే కదా ఈ టీచింగు. ఇది అంతా భగవంతుడు ఎందుకు చెపుతున్నాడు అంటే ఒకవేళ మీలో ఏదైనా విషం ఉన్నా దానిని అమృతంగా మార్చుకోవటానికే. ఈ టీచింగు ప్రయోజనం అదే. ఈ ప్రపంచం అంతా మాయ, మాయ అంటున్నారు కదా! మీరు గంటల తరబడి మాకు బోధిస్తున్నారు. ఈ మాయలో మళ్ళీ ఈ గొడవలు ఎందుకు అని ఆచార్యులవారిని అడిగారు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు రాత్రి స్వప్నంలో ఏదైనా పులి వచ్చింది అనుకో, అది నిజమా అబద్ధమా అంటే అది అబద్ధమైన పులే. కాని ఆ పులిని చూస్తే నీకు భయం వేస్తుంది, నీకు మెలకువ వచ్చేస్తుంది. అంటే అబద్ధమైన పులి మీకు మెలకువ తీసుకొని వచ్చింది కదా! నేను చెప్పే టీచింగు కూడా అలా ఉపయోగపడుతుంది. అబద్ధమైన పులి నీకు ఎలా మెలకువ

తీసుకొనివచ్చిందో అలాగే నా టీచింగు అంతా అబద్ధం అయినా అది నిన్ను అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి మేల్కొలుపుతుంది. అంతే మీకు జ్ఞానాన్ని తీసుకొనివస్తుంది అని చెప్పారు. లౌకికులు వారికి తోచినట్లుగా మాట్లాడుతూ ఉంటారు. అలా మాట్లాడుతూ ఉన్నా నీ బుద్ధికి చాపల్యం కలగకూడదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే భావన నీకు స్థిరంగా ఉండాలి. మీరు ఎక్కడో దూరం వెళ్లనక్కరలేదు. ఈ గోడదాటి వెళితే రకరకాల మనుషులు రకరకాలుగా మాట్లాడుతూ ఉంటారు. ఆ లౌకికుల మాటలు విని మీరు కలత చెందవద్దు. ఈశ్వరుడు లేడు అని వాళ్ళు చెపుతారు అనుకోండి ఈశ్వరుడు ఉన్నాడు అనే విశ్వాసం మీకు చలించకూడదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం చపలత్వం లేకుండా ఉంటే నూటికి యాభై మార్కులు మీకు వచ్చేసినట్లే.

బుద్ధుడితో ఒక భక్తుడు ఏమన్నాడు అంటే మీరు సత్పురుషులతో స్నేహం చేయమంటున్నారు. మా ప్రాంతం అంతా లౌకికులే అని చెప్పాడు. మీ ఊరిలో అంతా లౌకికులే అయితే వారితో జతలు కట్టవద్దు. అడవిలో ఏనుగు ఎలా ఒంటరిగా బతుకుతుందో అలాగే నువ్వు కూడా ఒంటరిగా బతుకు అంటే ఏకాంతంగా ఉండు. నీకు కాఫీ దొరకటం లేదని విషం తాగుతావా. నీకు స్నేహం చేయటానికి భక్తులు దొరకటం లేదు అని లౌకికులతో స్నేహం చేస్తావా? మీకు మంచి స్నేహాలు దొరకకపోతే ఏకాంతంగా జీవించండి అంతేగాని లౌకికులతో జతలు కట్టవద్దు. ఈ పని చేస్తే ఈ పుణ్యం వస్తుంది, ఆ పని చేస్తే ఆ ఫలితం వస్తుంది అని చిల్లర గొడవలు చాలా చెపుతూ ఉంటారు. అటువంటి గొడవలలోనికి వెళ్లవద్దు. పరమాత్మయందు మీ మనస్సును నిలబెట్టండి. పరమాత్మయందు మీ మనస్సు నిలకడగా ఉంటే, స్థిరంగా ఉంటే నువ్వు యోగ సిద్ధుడవు అవుతావు. నువ్వు బతికి ఉండగా చచ్చిపోతే నీకు జ్ఞానం వచ్చేస్తుంది. నువ్వు బతికి ఉండగా చనిపోయిన వాడు ఎలా ఉంటాడో అలా ఉంటే ఆశాపాశాలు నిన్ను వదిలేస్తాయి, ఇంక నీకు బంధాలు ఉండవు, అంతేకాదు జ్ఞానం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అందుచేత బతుకు, చచ్చినవాడివలె బతుకు.

దేహప్రారబ్ధాన్ని బట్టి ఒకోసారి సంతోషం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది. జీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. నీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చినా ఉద్రేకపడవద్దు. ఒకవేళ సుఖం వచ్చింది అనుకో దాని తాలూక స్పృహ పెట్టుకోకు. అప్పుడు సుఖపడ్డాము, రోజులు బాగా వెళ్లిపోయాయి అని అస్తమాను అవి జ్ఞాపకం పెట్టుకోవద్దు. నీకు వచ్చిన దుఃఖం నిజంకాదు, సంతోషం కూడా నిజంకాదు. పరమాత్మను స్మరించటం మానేసి ఇటువంటి గొడవలు గుర్తుకు వచ్చినా వాటిని తలపెట్టుకోవద్దు. నువ్వు దుఃఖంతోటి జత కట్టవద్దు, సంతోషంతోటి జతకట్టవద్దు. అంటే దుఃఖం వచ్చినప్పడు కుంగిపోకు, సంతోషం వచ్చినప్పడు పొంగిపోవద్దు. రెండూ మంచివి కాదు. నీ సాధనకు, మనస్సు అంతర్ముఖం అవ్వటానికి రెండూ అడ్డే. మీరు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చొని చూసుకోండి. మీకు ఎక్కడ రాగం ఉంటే మీ మనస్సు అక్కడకు వెళ్లిపోతుంది. మీకు ఎక్కడ ఎక్కువ ఇష్టం ఉందో మీ మనస్సు

అక్కడకు వెళ్ళిపోతుంది. అయిష్టం ఎంత గట్టిగా బంధిస్తుందో ఇష్టం కూడా అంత గట్టిగా బంధిస్తుంది. అందుచేత ఈ రాగద్వేషాలను మీరు ప్రయత్నం చేసి విడిచిపెట్టండి

మనం పామును పట్టుకోవటానికి వెళితే అది మనలను కరిచేస్తుంది. అదే పామును పాములవాడు వచ్చి పట్టుకుంటే వాడిని కరవదు. ఎందుచేతనంటే వాడి దగ్గర ఏదో ఉంటుంది, ఆ వాసనకు అది కరవదు. అదేవిధంగా స్వరూపజ్ఞానం కలవాడిని ఇంద్రియాలు కూడా ఏమీ ముట్టుకోవు, ఇంద్రియాలు వాడి జోలికి రావు, ఇంద్రియాలవల్ల వాడికి ఏ ఆపదలు కలగవు. మీకు డబ్బు ఉంది అనుకో బ్యాంక్‌లో దాచుకోండి. కాని మీ హృదయంలో మటుకు మీరు పేదవారిగా ఉండండి. మీ హృదయంలోనికి డబ్బు తాలుక గర్వం రానివ్వకండి. ధనగర్వంకాని, పాండిత్యంకాని ఏదీ మీ హృదయంలోనికి రానివ్వవద్దు. బయట మీ పరిస్థితులు, అంతస్థులు బాగుండవచ్చు. కాని బయట గొడవలు ఏమీ మీ హృదయంలోనికి రానివ్వకండి. అవన్నీ స్వప్నమే.

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**

రాముడిగా వచ్చినవాడు నారాయణుడే, కృష్ణుడుగా వచ్చినవాడు నారాయణుడే. ఈ మంత్రం కలియుగ ప్రారంభంలో బ్రహ్మదేవుడు నారదుడికి చెప్పాడు. ఇది మహామంత్రం. ఈ మంత్రం బాగానే ఉంది, నువ్వు ఇంకోటి చెప్ప అని నారదుడు బ్రహ్మదేవుడిని అడిగితే నువ్వు ఎన్నిసార్లు అడిగినా ఈ మంత్రం తప్పించి ఇంకోటి చెప్పను అన్నాడు. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే మీరు ఒక చెట్టుకిందకు వెళ్ళి గట్టిగా చప్పట్లు కొట్టండి అక్కడ ఉన్న పక్షులు అన్నీ ఎగిరిపోతాయి. ఆలాగే మీరు హరేరామ, హరేకృష్ణ నామం చేసుకొంటూ ఉంటే ఆ నామం చేస్తున్నంతసేపు మీలో ఉన్న వాసనలు ఎగిరిపోతాయి. మీరు చెట్టు దగ్గర చప్పట్లు కొడితే పక్షులు ఎలా పారిపోతాయో అలాగే మీరు నామం చేస్తున్నంతసేపు మీ హృదయంలో ఉన్న వాసనలు పారిపోతాయి. అంటే నామం అంత బలీయమైనది.

## అమలాపురం మాష్టారు అమెరికా పర్యటన విశేషాలు

సద్గురువు, స్వగురువు, శ్రీనాన్నగారి అనుగ్రహము, ఆశీస్సులు, అనుమతి మరియు ప్రోత్సాహముతో అమలాపురం మాష్టారుగా పిలవబడే చావలి సూర్యనారాయణమూర్తి అను నేను నా శ్రీమతితో, అమెరికా దేశము ఛార్లెట్ పట్టణములోని మా కుమారుని నివాసమునకు ది॥ 24-03-2016న క్షేమముగా చేరితిమి. అప్పటికే నామదిలో అమెరికాలో నివాసముంటున్న రమణభక్తులను కలుసుకోవాలన్న కోరిక ప్రబలముగా ఉన్నది. మా అదృష్టము కొలది మేము నివాసముంటున్న ప్రాంతమునకు అతిసమీపములోనే శ్రీనాన్నగారి భక్త కుటుంబము ఉన్నది. వారి పేర్లు శ్రీ వై.రామకృష్ణంరాజు భార్య శ్రీమతి శివపూర్ణిమ. అమెరికాలో మేము ఉన్న కాలములోనే శివపూర్ణిమ తల్లిగారు శ్రీమతి కృష్ణవేణిగారు